క్లుప్తంగా

అభివృద్ధికి సహకరిద్దాం

మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొందుర్గు: కార్యకర్తల కృషితోనే రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించిందని, ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు ప్రతీఒక్కరి సహకారం తప్పనిసరిగా ఉండాలని మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో వీర్లపల్లి శంకర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి ఎమ్మెల్యేగా గెలిపించడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో నరేందర్, రామయ్యగౌడ్, పెంటయ్య, యాదయ్య, కృష్ణ, మాణయ్య, ప్రసాద్, మహేందర్, రవీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముసురుకుంది..

ఇబ్బందుల్లో జనం



గొడుగు సహాయంతో వెళ్తున్న విద్యార్థినులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో అర్ధరాత్రి నుంచి ముసురు ప్రారంభమైంది. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి విద్యార్థులు, వ్యాపారస్తులు తమ పనులను చేసుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలో అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వర్షం కురిసింది. మిచాంగ్ తుఫాన్ వల్ల చలిగాలులు వీయడంతో ప్రజలు ఎక్కువగా ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోయారు. ఈ తుఫాన్ మరో రెండు రోజులు ఉందని అధికారులు తెలపడంతో ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలం 'గులాబీ'కే లీడ్

కొందుర్గు: షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్‌కి ఆధిక్యం వచ్చినప్పటికి కేవలం జిల్లేడ్ చౌదరిగూడ మండలం బీఆర్‌ఎస్‌కే లీడ్ వచ్చిందని మండల నాయకులు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతోపాటు ఇంద్రానగర్, ఎల్కగూడ, పెద్దఎల్కిచర్ల, వీరన్నపేట, చేగిరెడ్డి ఘనాపూర్, గుంజల్‌పహాడ్, ఎదిర, ముష్టిపల్లి, పీర్జాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కే ఓట్లు అధికంగా పడ్డాయని వారు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో కలిపి బీఆర్‌ఎస్‌కి 1,494 ఓట్ల ఆధిక్యత లభించింది. కొందుర్గు మండల కేంద్రంతోపాటు శ్రీరంగాపూర్, చిన్నఎల్కిచర్ల, పర్వతాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా ఓట్లు పోల్ అయ్యాయి.

వీర్లపల్లి శంకర్‌కు మంత్రిపదవి ఇవ్వాలి

ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ

నందిగామ: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నందిగామలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ కైవసం చేసుకుందని, ఈ పర్యాయం కాంగ్రెస్ అభ్యర్థిగా వీర్లపల్లి శంకర్ ఘన విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో 10 ఏళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం వీర్లపల్లి శంకర్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో మున్సిపాలిటీకి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోర్డును తొలగించి స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ రవీందర్ రెడ్డి మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదే భూమిని కొందరు కబ్జాకు ప్రయత్నిస్తుండగా స్థానికుల ఆందోళనతో దిగివచ్చిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి 14 గుంటల భూమిని గుర్తించి హద్దులను, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు హెచ్చరిక బోర్డును తొలగించి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారని.. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

వరికి వాన గండం..!

- తుఫాన్ తెచ్చిన తంటా
- వర్షంతో కోతలు ఆలస్యం
- వడ్లు తడిస్తే నష్టమంటున్న రైతులు



అమ్డాపూర్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరి



వెంకటాపూర్‌లో నేలకొరిగిన వరిపైరు

మొయినాబాద్: వరికి వాన గండం తప్పేటట్టు లేదు. వర్షం వల్ల వరి కోతలు ఆలస్యమయ్యేటట్లు కనిపిస్తుంది. ఈ సమయంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావం వరి కోతలపై పడిందని పలువురు రైతన్నలు ఆవేదన్య వ్యక్తం చేస్తున్నారు. రాత్రి నుంచే పలు చోట్ల వర్షాలు పడడంతో వరిచేను తడిసి కోతలకు ఇబ్బందిగా తయారైంది. మొయినాబాద్ మండలంలో సుమారు 3 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. వరి చేళ్లు ఇప్పుడే కోతకొచ్చాయి. ప్రస్తుతం కూలీల కొరతతో చాలా మంది రైతులు యంత్రాలతోనే కోతలు కోయించడానికి మొగ్గుచూపుతున్నారు. అందరివీ ఒకే సారి కోతకు రావడంతో తగినన్ని యంత్రాలు కూడా అందుబాటులో లేవు. ఉన్న యంత్రాలతోనే కోతలు చేయాల్సి వస్తుంది. ఒక్కో యంత్రం రోజుకు 8 –10 ఎకరాల కోత కోస్తుంది. దీంతో వరికోతలు ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నాయని రైతన్నలు చెబుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడటం రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. చేతి కొచ్చిన పంట నీటి పాలవుతుందని దిగులు పడుతున్నారు. కొద్ది పాటి వర్షం పడినా కోత కొచ్చిన చేను దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు మండలంలో తేలిక పాటి జల్లులు కురిశాయి. దీంతో వరిచేను నేలకొరిగాయి. మండలంలోని సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, అమ్డాపూర్, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, ఎతర్‌బార్‌పల్లి, తోలుకట్ట, అప్పారెడ్డిగూడ, పెద్దమంగళారం, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి, చిలుకూరు, నాగిరెడ్డిగూడ, బాకారం, తదితర గ్రామాల్లో వరి అధికంగా వేశారు. ఇప్పటికే కొంత మంది రైతులు వరిచేను కోసి వడ్లను కుప్పలుగా పోశారు. వర్షం పడుతుండడంతో వడ్లు ఆరబోసే పరిస్థితి లేదు. తుఫాను ప్రభావం మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కుప్పలుగా పోసిన వడ్లు ఆరబోయకపోతే మొలకెత్తుతాయని వారు చెబుతున్నారు. మరోవైపు వర్షం పడడంతో కోతకొచ్చిన చేళ్లలోకి యంత్రాలు దిగలేకపోతున్నాయి. కోతలు ఆలస్యమైతే వడ్లు రాలి నేలపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బస్సు సర్వీసులు పెంచండి

ఏబీవీపీ డిమాండ్



చేవెళ్లలో ఆర్టీసీ కంట్రోలర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ ప్రతినిధి శివ

చేవెళ్ల: విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న బస్సుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులను పెంచాలని ఏబీవీపీ ప్రతినిధి శివ డిమాండ్ చేశారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో మంగళవారం కంట్రోలర్‌ను కలిసి బస్సుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నుంచి శంకర్‌పల్లికి వెళ్లే రూట్‌లో బస్సు సర్వీసులు సరిగ్గా లేకపోవడంతో నిత్యం పలు గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ కంట్రోలర్ దృష్టికి తెచ్చారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని వచ్చే బస్సులు కూడా సమయపాలన పాటించడం లేదని శివ పేర్కొన్నారు. వికారాబాద్ రూట్‌లో బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు కళాశాల, పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం తరగతులకు సకాలంలో హాజరు కాలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కంట్రోలర్ వికారాబాద్ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి బస్సుల సమస్యను పరిష్కరించాలన్నారు. మండల టౌన్ సెక్రటరీ మహిపాల్, వివేకానంద కాలేజ్ అధ్యక్షుడు కిషోర్, మండల ఉపాధ్యక్షుడు విజయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలింది



శివరామాలయాలకు వెళ్లే బీటీ రోడ్డు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివరామాలయాకు వెళ్లే రహదారి గుంతుపడి అధ్వాన్నంగా మారింది. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి మైసిగండి సమీపంలో కిలోమీటరు దూరంలో శివరామాలయాలు ఉన్నాయి. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు 20 ఏళ్ల క్రితం ఈ మార్గంలో బీటీ రోడ్డు వేశారు. అయితే ప్రస్తుతం అది పూర్తిగా కంకర తేలి మట్టిరోడ్డును తలపిస్తూ గోతులమయంగా మారింది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు బీటీ రోడ్డును పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు.

భక్తిభావంతో మోక్షం



మొయినాబాద్‌రూరల్: హనుమాన్ దేవాలయంలో పూజలో అయ్యప్ప స్వాములు



షాద్‌నగర్: శివమారుతీ దేవాలయంలో



అన్నదానంలో శేఖర్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలో లక్ష్మీనర్సింహ్మా కాలనీలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో పట్టణానికి చెందిన దండు శరత్‌బాబు, దండు వాసు దంపతులు అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్, బసప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మంజు శ్రీ రాఘవేందర్, రేటికల్ నందీశ్వర్, చింటు, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గజవాడ నర్సింలు, అగ్గనూరు బస్వం, బాబర్‌ఖాన్ పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకున్నప్పుడే మోక్షం లభిస్తుందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు ముదిగొండ మంజులరవియాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ హనుమాన్ దేవాలయ ఆవరణలో కుమ్మరి దత్తు గురుస్వామి ఆధ్వర్యంలో కుమ్మరి మణెమ్మ నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజను వినోద్‌శర్మ గురుస్వామి వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ మంజులరవియాదవ్ మాట్లాడుతూ భక్తిమార్గంమే ప్రతి ఒక్కరిని సన్మార్గంలో నడుపుతుందన్నారు. గురుస్వాములు మురళీ, రవీందర్, మహేందర్, వెంకటేష్‌గౌడ్, రాఘవేందర్, మహేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన్ను శాలువాతో సన్మానించారు. స్వాములు నర్సింహ్మా, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో విలక్షణ తీర్పు!

సంబరాలకు దూరంగా గెలిచిన, ఓడిన నాయకులు



చేవెళ్ల: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల ప్రజలు విలక్షణ తీర్పుతో అటు గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఇటు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సందిగ్ధంలో పడ్డారు. ఈ ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను గెలిపించుకున్నారు. రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. దీంతో చేవెళ్లలోని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలకు దూరంగా ఉన్నారు. విచిత్రమేమంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి పాలయితే, చేవెళ్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని జనం గెలిపించుకున్నారు. దీంతో ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే సంబరాలు చేసుకునేందుకు సైతం వెనకడుగు వేస్తున్నారు. అటూ కాంగ్రెస్‌లోనూ ఇక్కడ అదే పరిస్థితి ఉంది. ఇన్ని రోజులు కష్టపడి పనిచేసిన పార్టీ ఎమ్మెల్యేను గెలిపించుకోలేకపోయిన బాధలో కార్యకర్తలు ఉంటే రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌కే ప్రజలు మద్దతు ఇచ్చి పట్టం కట్టారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టనుంది.

గెలిచిన ప్రతీసారి ప్రతిపక్ష ఎమ్మెల్యేనే అంటూ చర్చలు..

ఈ నియోజకవర్గంలో ఓటర్లు ఇచ్చే తీర్పు విలక్షణంగా ఉండడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలే ఉంటారని అందరూ చర్చించుకుంటున్నారు. గత కొన్ని ఎన్నికలను పరిశీలిస్తే వారి వాదనలు నిజమనిపించక తప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఇచ్చే తీర్పుకు చేవెళ్ల నియోజకవర్గంలో ఇచ్చే తీర్పు భిన్నంగానే ఉంటూ వస్తోంది. అధికారంలోకి వచ్చే పార్టీ ఎమ్మెల్యేను కాకుండా ప్రతిపక్షపార్టీ ఎమ్మెల్యేనే పలుమార్లు గెలిపించారు. ఇప్పుడు అదే తీర్పు మళ్లీ కొనసాగినట్లైంది. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇంద్రారెడ్డి గెలుపొందినప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కొన్ని నెలలకే ఆయన అకాల మరణంతో సతీమణి పి సబితారెడ్డి కాంగ్రెస్ నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత పునర్విభజనలో భాగంగా చేవెళ్ల ఎస్సీ రిజర్వు కావడంతో 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి కేఎస్ రత్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. తెలంగాణ రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా టీఆర్‌ఎస్ నుంచి కేఎస్ రత్నం పోటీ చేస్తే కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాలె యాదయ్యను గెలిపించారు. అప్పుడు రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. ఆ అతరువాత 2018లో జరిగిన ఎన్నికల్లో మాత్రం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించడంతో ఈ తీర్పు మారిందనుకున్నారు. కాని 2023 ఎన్నికల్లో మళ్లీ పాత తీర్పు రిపీట్ అయ్యిందని పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించడంతో ఇక్కడి ప్రజల తీర్పు విలక్షణంగానే ఉంటుందని చర్చ జరుగుతుంది.

8న మండల సర్వసభ్య సమావేశం

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు మండల సూపరింటెండెంట్ సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నక్షత్రంజేవంతు అధ్యక్షతన నిర్వహిస్తారని వారు తెలిపారు. మండల అధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి రవీందర్

కడ్తాల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీడీఎస్ జేఏసీ కేంద్ర సంఘం పిలుపు మేరకు డిసెంబర్ 12వ తేదీ నుంచి గ్రామీణ తపాల ఉద్యోగులు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) వనపర్తి డివిజన్ కార్యదర్శి రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణా తపాల ఉద్యోగుల డిమాండ్లైన.. 8 గంటల పని, పెన్షన్, జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలని, పెయిడ్ లీవ్‌లను 180 రోజుల వరకు దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కమలేశ్ చంద్ర కమిటీ ఇచ్చిన సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో తపాలా ఉద్యోగుల సమస్యలను చర్చించి, కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

మెజార్టీ ఎలా తగ్గింది

- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్‌ఎస్ కేడర్
- పెద్ద లీడర్ల గ్రామాల్లోనే కారుకు తక్కువ ఓట్లు
- తప్పెక్కడ జరిగిందో తెలియక తలలు పట్టుకుంటున్న నేతలు



మంచిరెడ్డికి మద్దతుగా ప్రచారం (ఫైల్)

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిని బీఆర్‌ఎస్ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. పోలింగ్‌కు ముందు మా గ్రామంలో మెజార్టీ వస్తుంది. బూత్ స్థాయిలో మనమే బలంగా ఉన్నాం, ఇతర పార్టీల వారు మనకు దరిదాపుల్లోకి కూడా రారంటూ బీరాలు పలికిన నేతలు ఆ గ్రామాల్లో కారు గుర్తుకు పడిన ఓట్లు చూసి బిత్తరపోతున్నారు. బూత్ స్థాయిలో విస్తృత ప్రచారం, నిత్యం విందు భోజనాలు, జేబునిండా డబ్బు అందజేసినా.. మెజార్టీ మైనస్‌గా ఉండటం పట్ల కిందిస్థాయి కార్యకర్తలు తల్లడిల్లిపోతున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 47,948 ఓటర్లు ఉండగా.. 38,489 ఓట్లు పోలయ్యాయి. యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి ఫార్మా భూబాధిత గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ రాదని ముందు నుంచే అభిప్రాయం ఉన్నప్పటికీ డబ్బుతో వ్యతిరేకతను తగ్గించవచ్చనే అభిప్రాయం నెలకొంది. ఆ కోణంలో కూడ బీఆర్‌ఎస్ అధిష్టానం కృషి చేసింది. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తా డిపర్తి గ్రామాల్లో ఫార్మాసిటీ ప్రభావం, నస్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాల్లో నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల కౌలు రైతులంతా కాంగ్రెస్‌కే మద్దతిచ్చారు. ఈ ఆరు గ్రామాల్లోనే కారు గుర్తుకంటే చేతి గుర్తుకు 3వేలకు పైగా మెజార్టీ వచ్చింది.

పేరున్న లీడర్ల గ్రామాల్లో తక్కువ ఓట్లు..

యాచారం మండలంలోని బీఆర్‌ఎస్ పెద్ద లీడర్లుగా పేరొందిన గ్రామాల్లోనే కారు గుర్తు కంటే చేతి గుర్తుకు అధిక ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ గ్రామమైన మంతన్‌గౌరెల్లిలో చేతి గుర్తుకు 400కు పైగా మెజార్టీ వచ్చింది. ప్రధాన కార్యదర్శి పాశ్చ భాషా గ్రామమైన నక్కర్తమేడిపల్లిలో 200కు పైగా మెజార్టీ, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ గ్రామం మాల్‌లో 300కు పైగా మెజార్టీ, మాజీ ఎంపీపీ వర్త్యవత్ రజిత గ్రామం నందివనపర్తిలో 400కు పైగా మెజార్టీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి గ్రామం గునుగల్‌లో 250కు పైగా మెజార్టీ వచ్చింది. యాచారం గ్రామంలో చేతి గుర్తుకు ఏకంగా 600కు పైగానే మెజార్టీ వచ్చింది. అదే విధంగా బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులున్న గ్రామాల్లో కూడా కారు గుర్తు కంటే చేతిగుర్తుపై అత్యధికంగా ఓట్లు వచ్చాయి.

హస్తం గూటికి వెళ్దామా..

ఇన్నాళ్లు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అండతో గ్రామాల్లో వన్‌మ్యాన్ షోతో చెలరేగిపోయిన బీఆర్‌ఎస్ నేతల్లో కొందరు నాయకులు కారు దిగి హస్తం గూటికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిపాలైన మరుసటి రోజు నుంచే కాంగ్రెస్‌లోని పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు మండలంలో చర్చ జరుగుతుంది.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



కాలె యాదయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న దామరగిద్ద, చేవెళ్ల గ్రామాల నాయకులు

చేవెళ్ల: హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాలె యాదయ్యకు నియోజకవర్గంలోని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో వెళ్లి కలుస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఆయనకు పార్టీ నాయకులు కాకర్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల వారీగా ప్రజాప్రతినిధులు, మండలనాయకులు ఆయన్ను కలిసి పూల బొకేలతో శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులు చేయడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పామెన, ఆలూరు, తలారం, చేవెళ్ల, ఊరేళ్ల, దామరగిద్ద, మండల ముదిరాజ్ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు.

యాదగిరిగుట్టకు పాదయాత్రగా

- మల్‌రెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి
- ఘన స్వాగతం పలుకుతున్న నేతలు



అభిషేక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలవడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా మంగళవారం మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతో పాటు 40 ఏళ్ల తర్వాత ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా మొక్కు చెల్లించేందుకు ఇబ్రహీపట్నం నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్ర ద్వారా బయలుదేరినట్లు తెలిపారు. కాగా ఆయనకు కాంగ్రెస్ నాయకులు, మల్‌రెడ్డి అభిమానులు మార్గ మధ్యలో స్వాగతం పలుకుతున్నారు.

తడిసిన ధాన్యం

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ముసురు వర్షం కురిసింది. ఎన్నికల నేపథ్యంలో కూలీల ఇబ్బందులతో ఈ దఫా రైతులు వరి పంటను ఆలస్యంగా కోశారు. వరి ధాన్యం కుప్పలు ఇంకా వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లోనే ఉన్నాయి. యాచారం, మంతన్‌గౌరెల్లి, మాల్, కొత్తపల్లి, నందివనపర్తి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో ముసురు వర్షంతో ధాన్యం తడిసిపోయింది. అయితే మధ్యాహ్నం కొద్దిసేపు వర్షం తగ్గడంతో రైతులు ధాన్యం ఉన్న పడాలను తీసి ఆరబెట్టారు. ధాన్యం కొనుగోలు సమయంలో అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని రైతులు కోరుతున్నారు.

చల్లబడిన వాతావరణం..

ఇబ్రహీంపట్నం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంలో ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు కురిసాయి. ఎడతెరిపిలేకుండా చిరు జల్లులు కురుస్తుండటం, చల్లని గాలులు వీస్తుండటంతో ప్రజలు చలికి వణికిపోయారు. పిల్లలు, వృద్ధులు ఇంటికే పరిమితమయ్యారు. తుఫాన్ ఎఫెక్ట్ మరో రెండు రోజుల పాటు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు.